మే - జూన్, 2010

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



## నిజ క్రైస్తవుడు ఎవరు?



# "మనస్సులోని మాట"

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

యేసుక్రీస్తు నామములో ప్రియులైన స్పర్శ పాఠకులకు వందనములు. మీరంతా బావున్నారా? పిల్లలు ఎగ్జామ్స్ ఎలా వ్రాశారు? రిజల్ట్స్ గురించి టెన్షన్ పడకండి. ఎగ్జామ్స్‌లో ఫెయిల్ అయినంత మాత్రమున జీవితం వ్యర్థం అనుకునే ధోరణిని వీడండి. ఆధ్యాత్మిక విషయములలో ఎలా ఉన్నారు? మన ప్రభువును, రక్షకుడునైన యేసుక్రీస్తు రాకడ కొరకు తండ్రి అయిన దేవుడు మనలను సిద్ధపరుస్తున్నాడని మనము ఎల్లప్పుడూ కృతజ్ఞతాస్తుతులు చెల్లించేవారిగాఉండాలి.

యెహోవాను బట్టి సంతోషించుడి, ఆయన నీ హృదయవాంఛలను తీర్చును అని వ్రాయబడిన విధంగా మనము ఎల్లప్పుడూ ఆయనను బట్టి సంతోషించుచూ ముందుకి సాగిపోదాము. మనము ఎన్నడూ భవిష్యత్‌ని గురించి ఆందోళన చెందకూడదు, మన నిరీక్షణ ప్రభువే. మన బ్రదుకు దినములన్నియూ ఆయన యందు నిరీక్షణతో సాగిపోయే వారిగా ఉందాము. అపజయములలో, క్రుంగిన సమయములలో సైతం అనుకూల ఆలోచనా విధానముతో సాగిపోదాము. భవిష్యత్ కొరకు మంచి కలలను కని, ఆ కలలను సాకారము చేసుకోవడానికి శక్తికి లోపము లేకుండా పని చేద్దాము. అప్పుడు దేవుడు మనకు సహాయం చేస్తాడు. ఒక రోజున కలల నెరవేర్పును మన కన్నులారా చూచినప్పుడు ఎంతో సంతోషం కలుగుతుంది.

స్పర్శ పాఠకులైన మీరందరు యెహోవాను బట్టి సంతోషించుచూ, మంచి కలలు కని, వాటి నెరవేర్పు కొరకు ఎదురు చూచే వారిగా ఉండాలని ఆశిస్తూ........

మీ సహోదరుడు.....



మే - జూన్, 2010

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- నిజ క్రైస్తవుడు ........ 2
- ఓ క్షణం గురించి ఆలోచించు ........ 5
- మాట వినుట (స్త్రీల ప్రత్యేకం) ........ 6
- ప్రశాంతమైన జీవితము ........ 9
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 10వ భాగము ........ 11
- మంచి పిల్ల (బాలల శీర్షిక) ........ 13
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 15
- ఇది తెలుసా? (మలి) ........ 17
- అవతలి వారి పట్ల శ్రద్ధ కనపరచండి ........ 18
- ఆత్మ ఫలము ........ 19
- జీవితము ........ 20
- గిల్బోవ పర్వతము ........ 21
- బైబిల్ క్విజ్-10 ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# నిజ క్రైస్తవుడు

- బ్రదర్ ఎపఫ్రా




క్రైస్తవుడు అనగానే గుర్తుకొచ్చేది ప్రభువైన యేసుక్రీస్తు. క్రైస్తవుడు అనగా క్రీస్తును అనుసరించి నడిచేవాడు. ఈ నవనాగరిక ప్రపంచంలో అనుసరించడం అనేది బాహ్య సంబంధమైనదిగా భావిస్తున్నాము, కానీ అనుసరించడం అనేది అంతరంగ లేక హృదయ సంబంధమైనదని గ్రహించాలి. అందుకే క్రైస్తవుడు అనే స్థానంలో నిజక్రైస్తవుడు అని చెప్పవలసి వస్తుంది. యేసుక్రీస్తు కూడా ఒక సందర్భంలో నిజమైన ఇశ్రాయేలీయుడు అని ఒక వ్యక్తి గురించి సాక్ష్యమివ్వడం జరిగింది. పాతనిబంధనా కాలంలో నిజఇశ్రాయేలీయులకు సాదృశ్యమే నేటి నిజక్రైస్తవుడు. యేసు ఆ వ్యక్తిని గురించి సాక్ష్యమివ్వడానికి చూచినది కపటము లేని మనస్సు. అందుకే ఇతనిలో ఏ కపటము లేదని చెప్పడం జరిగింది. నేడు క్రైస్తవులుగా పిలువబడుతున్న వారిలో ఎంత మంది నిష్కపటంగా జీవిస్తున్నారు అని చూడగలిగితే విభ్రాంతి చెందే విషయాలు వెలుగులోకొస్తాయి. లెక్కలు చూడటం కుదరదు, కానీ లెక్కలు చూచే దినం ఒకటి ఉంది. ఆ దినము ఎదుర్కొనుటకు సిద్ధముగా ఉన్నావా ?

కపటము, కపటానికి జనకుడు లోకాధికారియైన అపవాది అనగా సాతాను ఏ విధంగా లోకంలో లేక సంఘంలో కపటమును ప్రవేశపెడుతున్నాడనేది సవివరముగా మనం తెలుసుకుందాము.

**మాటలలో కపటము :-** వీటిని గురించి చెప్పుకోవలసివస్తే మన ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు చివరికి సామాన్యమైన మానవుడు కూడా మాటలలో లౌక్యం లేకుండా మనుగడ సాగించలేము అనే పరిస్థితులు నెలకొనివున్నాయి. అందుకే ఎన్నికల ముందు కపట వాగ్దానాలు, వ్యాపారసంస్థల కపట ప్రకటనలు, మనుష్యుల కపట సంభాషణలు, ఒకరిని ఒకరు మోసం చేసుకోవడం జరుగుతుంది. ఎంత కపటంతో వ్యవహరిస్తే అంత పైచేయి సాధించినట్లుగా భావిస్తున్నారు. బాధాకరమైన విషయమేమంటే, క్రైస్తవులు కూడా అదే బాటలో ప్రయాణించడం. కపట మాటల్ని గురించి బైబిల్ గ్రంథంలో సామెతలు 26:23,24 **"పగవాడు పెదవులతో మాయలు చేసి అంతరంగములో కపటము దాచుకొనును". చెడు హృదయమును, ప్రేమగా మాట్లాడు పెదవులు మంటి పెంకు మీది వెండి పూతతో సమానం.** అవి ఎన్నటికీ అతకవు.

ఒకరోజు దేవుడు ఒక వ్యక్తిని నీ తమ్ముడెక్కడ? అని అడుగుతుంటే, నా తమ్మునికి నేను కావలివాడనా ? అని సమాధానం చెప్పాడు. తీరా చూస్తే తన తమ్ముణ్ణి చంపి భూమిలో

పాతిపెట్టి ఏమీ ఎరగనట్లు మాట్లాడుతున్నాడు. అతనే బైబిల్ గ్రంథంలో ఉన్న కయీను. అతడు చేసిన దానికి పర్యవసానంగా బ్రతుకుదినములన్నీ దేశదిమ్మరిగా తిరిగాడు. వంచనతో ఎక్కువ కాలము మనుగడ కొనసాగించలేము. అందుకే వంచనతో కూడిన మాటలు విడిచిపెట్టాలి.



**<u>కపట ప్రేమ –</u>** ప్రేమ అనేది సృష్టిలో ఎంతో ప్రభావవంతమైనది. ప్రతి మనుష్యుడు తాను అందరిచేత ప్రేమించబడాలి అనుకుంటాడు. ప్రేమించడం, ప్రేమించబడటం అనే అనుభూతులను మాటలతో వర్ణించలేము. అలాంటి అద్భుతమైన స్పందనలో కూడా కపటం అనేది ప్రవేశించడం ఎంతో దుఃఖకరము. ప్రేమించినట్లుగా నటించడం ద్వేషించడం కంటే దారుణమైనది. మొట్టమొదటి మనుష్యులైన ఆదాము – హవ్వలను సాతాను ప్రేమించినట్లుగా నటించి మోసగించాడు. ఎంతగా మోసగించబడ్డారంటే తన చేతులతో నిర్మించి, ప్రతిదినమూ సంభాషిస్తూ, ఎంతో ప్రేమగా చూసుకుంటున్న తమ తండ్రి అయిన దేవునిని అనుమానించే స్థితిలోకి వచ్చారు, ఎంతో ఆశ్చర్యం. కపట ప్రేమ ఎప్పుడు ఎటువంటి షరతులు విధించదు, నిజమైన ప్రేమ కొన్నిసార్లు మేలు కోరి గాయాలు చేస్తుంది. యేసు శిష్యుడైన ఇస్కరియోతు యూదాని గమనిస్తే మొదటనుండి యేసుతోనే తిరుగుతూ ఆయన శిష్యుడిగా చలామణి అవుతున్నాడు. ఒకరోజు ఒక స్త్రీ తన దగ్గరున్న ఎంతో విలువైన అత్తరుబుడ్డిని పగలగొట్టి అత్తరుతో యేసుని అభిషేకించింది. ఇది గమనించిన ఇస్కరియోతు యూదా ఈ అత్తరుని వెలకు అమ్మి బీదలకు ఇయ్యవచ్చును కదా అని బీదలమీద ప్రేమ ఉన్నట్లు నటించాడు. **"వాడీలాగు చెప్పింది బీదలమీద శ్రద్ధ కలిగి కాదు కానీ వాడు దొంగై యుండి తన దగ్గర డబ్బుసంచి ఉండినందున అందులో వేయబడిన కానుకలు దొంగిలించుచూ వచ్చెను".** (యోహాను 12:6) అని బైబిల్ గ్రంథంలో వ్రాయబడియున్నది. ఈ దినములలో మనుష్యుల మీద ప్రేమ చూపించుటలో, కనికరపడుటలో వేరొక ఉద్దేశ్యము కలిగియుండుట కపట ప్రేమై ఉన్నది.

**<u>కపట బోధకులు –</u>** కొందరు బోధకులైనవారు తాము గొప్ప స్థాయిలోకి వెళ్ళుటకు ఏది ఉన్నా, లేకపోయినా లౌకిక జ్ఞానం అవసరమని తలంచుచున్నారు. లౌక్యముతో జీవించడం కపటము అనే సంగతి అర్థం కావడం లేదు. మోసపూరితమైన మాటలు చెబుతూ మనుష్యులను మభ్యపెట్టే వారిగా ఉండటం దుఃఖకరమైన విషయం. పరలోక రాజ్యాన్ని వదులుకోవడానికైనా సిద్ధంగా ఉన్నారు కానీ తమ కపట సంఘాన్ని వదులుకోవడానికి సిద్ధంగాలేరు. బోధకులైనవారికి అపోస్తలుడైన పౌలు చెప్పిన మాటలు సవాలుతో కూడుకున్నవి. 2 కొరింథి 1:12 – **"లౌకిక జ్ఞానమును అనుసరించక, నిష్కపటమైన హృదయముతో లోకములోనూ, సంఘములోనూ నడుచుకొన్నామని మా మనస్సాక్షి సాక్ష్యమిచ్చుటే మాకున్న అతిశయమని చెప్పుచున్నాడు."** ఈ దినములలో పెద్ద మందిరం

కట్టుట, ఒక గుంపును పోగుచేయుట అతిశయంగా భావిస్తున్నారు. సేవకా ! నీ అతిశయము దేనిలో?.

కపటమైన బోధలు ఎంత ప్రమాదకరమంటే, మేలును కీడుగా, కీడును మేలుగా మన కన్నులకు చూపిస్తాయి. అందుకే ప్రభువు ఒకరోజు **"మనుష్యులు కల్పించు పద్ధతులను దైవోపదేశములుగా బోధించి వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు"** (మత్తయి 15:9) అని కొందరిని గద్దించడం జరిగింది. ఉదాహరణకు చేయి ఎత్తితే చాలు రక్షించబడతారని ఆయా పథకాలలో చేరడం ద్వారా ఆశీర్వదించబడతారని, కొన్ని వారాలు చర్చికి రావడం ద్వారా దీవించబడతారు అని మనుష్యుల పద్ధతులు దైవోపదేశములుగా బోధించబడుచున్నవి. వీటి విషయమై జ్ఞానం కలిగి నడుచుకోవాలి.

కపట బోధల ద్వారా అనేకుల్ని తప్పు మార్గంలో నడిపించడమే కాక వారు కూడా దేవుని వలన కఠినమైన తీర్పును పొందబోవుచున్నారు. అందుకే యాకోబు ద్వారా దేవుడు తెలియపరచిన మాటేదనగా **"మరి కఠినమైన తీర్పు ఉందని యెరిగి మీలో అనేకులు బోధకులు కాకుండుడి "** (యాకోబు 3:1)

<u>**కపట బోధకుల లక్షణములు కొన్ని -**</u>

1. తమ సంఘమే పరలోకానికి చేరుతుందని బోధించుట.
2. మనుష్యులను పొగడ్తలతో ముంచెత్తుట.
3. సంఘమును ఖండించుటకు, బుద్ధి చెప్పుటకు మెహమాట పడటం.
4. క్రీస్తు శరీరమైన సంఘాన్ని వ్యాపారాత్మకంగా చూడటం.
5. సంఘాల్ని అపహాస్యాలకు నిలయంగా మార్చుట.
6. సినిమాలద్వారా, సీరియల్స్ ద్వారా దేవుడు మాట్లాడతాడు అని చెప్పుట.

ప్రియమైన చదువరీ! ఇప్పటివరకు మనం ధ్యానించిన విషయాలు ఎంతో భయంకరమైనవి. అనగా నీకెన్ని వరాలున్నా, నువ్వెంతో జ్ఞానవంతుడవైనా అన్నింటిని సమర్ధవంతంగా నడిపించగలిగిన నాయకుడివైననూ, విస్తారమైన పాలలో ఒక విషపు బొట్టు వలె, విస్తారమైన తలాంతులలో కపటమనే చిన్న విషము నీకున్న సమస్తాన్ని నష్టపరుస్తుంది. కాబట్టి మనసు మార్చుకొని యేసురక్తమును ఆశ్రయించి కపట స్వభావం నుండి నేడే విడుదల పొంది, నిజక్రైస్తవుడిగా రూపాంతరము చెందు. ఎంత కపట స్వభావంతో జీవిస్తున్నా ఆయన నిన్ను ఖచ్చితంగా విడుదల చేస్తాడు. పరిశుద్ధాత్ముడు మిమ్ములను కపటమును విడుచుటకు త్వరపెట్టునుగాక !

# ఓ క్షణం గురించి ఆలోచించు



నీవు టెన్షన్‌గా ఉన్న ఓ క్షణం
అటెన్షన్‌ని కోల్పోతావు
మొత్తానికి కన్ఫ్యూజన్‌లోకి పోతావు
అప్పుడు ఇరిటేషన్ ఫీల్ అవుతావు



తద్వారా వ్యక్తిగత సంబంధములను నాశనం చేసుకుంటావు
తరువాత సహకారం లభించకుండా పోతుంది
పరిస్థితులన్నీ క్లిష్టతరంగా మారతాయి
నీ బి.పి. ప్రమాదస్థాయికి చేరవచ్చు



అప్పుడు మెడిసిన్ తీసుకొనవలసి రావచ్చు
వెంటనే పరిస్థితిని అర్థం చేసుకుంటే
పరిష్కారం కొరకు ఆలోచించవచ్చు
అనేక సమస్యలు చర్చించుకోవడం ద్వారా పరిష్కారమవుతాయి
అది నీకు సాధ్యమవుతుంది

**ఇది నా ఉచిత సలహాగా భావించవద్దు**

**కేవలం ముందు జాగ్రత్త మాత్రమే**

**నీకు నా ఉద్దేశ్యం అర్థమైతే ఎప్పటికీ నీవు టెన్షన్ పడవు**

**ఒక్క క్షణం కోపం జీవితమునే నష్టపరచవచ్చు**

**జీవితకాలము శోకాన్ని మిగల్చవచ్చు**

# మాట వినుట

– సిస్టర్ విజయ

ప్రస్తుత కాలములో తల్లిదండ్రుల మాటలు వినని పిల్లలు, ఉపాధ్యాయులను అపహాస్యం చేసే విద్యార్ధులు మొత్తం మీద మాట వినని వారే అధికముగా కనబడుచున్నారు. మాటకి మాట ఎదురు చెప్పుట ఫ్యాషన్‌గా మారిపోవుచున్నది. వినుట అనేది కనుబడుటలేదు. ప్రేమించుటలో వినుట అనేది ఒక భాగం. పరిశుద్ధ గ్రంథమైన బైబిలు చెప్పుచున్న మాట ఏమనగా **"బలులు అర్పించుట కంటె ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుట కంటే మాట వినుటయు శ్రేష్ఠము"** 1 సమూ 15:22

దేవుని మందిరములలో పాటలు పాడుటకు, ప్రసంగములు చేయుటకు చూపిస్తున్న సుముఖత దేవుని ఆజ్ఞలు గైకొనటానికి అనగా మాట వినటానికి చూపించుటలేదు. మనము ఏది చేసిననూ, ఆయన మాట వినని వారమైతే చేసినదంతయూ వ్యర్థమే. దేవుని మాట అనగా వాక్యము ద్వారా నీతో దేవుడు మాట్లాడుచున్నప్పుడు దానిననుసరించి నడుచుకోవడం నేర్చుకోవాలి. దేవుని సేవకుని మాటను దేవుని మాటగా భావించి, విధేయత చూపించి, సమృద్ధిని పొందుకున్న స్త్రీ సారెపతు అను పట్టణములో విధవరాలు. ఆమె జీవితమును ధ్యానించినప్పుడు అనేక విషయములను మనము తెలుసుకోవచ్చు.

ఆహాబు అను రాజు ఇశ్రాయేలు ప్రజలను పరిపాలిస్తున్న కాలములో కరవు సంభవించగా, అక్కడ ప్రవక్తగా ఉన్న ఏలియాకు దేవుని వాక్కు ప్రత్యక్షమై నీవు సారెపతు అను ఊరికి వెళ్ళి ఉండు, అక్కడ నిన్ను పోషించడానికి ఒక విధవరాలిని ఉద్దేశించాను అని చెప్పెను. సారెపతు అను పట్టణం మధ్యదరా సముద్ర తీరమున తూరు, సీదోను పట్టణముల మధ్య ఉన్నది. ఏలియా లేచి ఆ పట్టణపు గవిని యొద్దకు చేరిన వెంటనే అక్కడ ఒక విధవరాలు కట్టెలు ఏరుకుంటూ కనిపించెను. ఏలియా ఆమెను పిలిచి, నా యెడల దయచూపి తాగడానికి నీళ్లు ఇవ్వమనెను. ఆమె నీళ్ళు తేవడానికి వెళ్లబోవుచుండగా మరల ఆమెను మీ చేతితో ఒక రొట్టె ముక్క కూడా తీసుకురండి అని అన్నాడు. అందుకు ఆమె నా దగ్గర కుండలో పట్టెడు పిండి, బుడ్డిలో కొంచెం నూనె మాత్రమే ఈ రోజుకి సరిపడా ఉన్నాయి. నేను, నా కుమారుడు చావబోయే ముందు వాటిని సిద్ధము చేద్దామని కట్టెలు ఏరుకోవడానికి వచ్చాను అని అన్నది. వెంటనే ఏలియా ఆమెతో నిర్భయంగా ఉండుడి, వెళ్లి మీరు చెప్పినట్లు చేయండి. అయితే ముందు నా కోసం చిన్న రొట్టె చేసి తీసుకురండి. తరువాత మీకూ, మీ అబ్బాయికి రొట్టెలు చేసుకోండి, ఇశ్రాయేలు ప్రజల దేవుడైన యెహోవా ఇలా చెప్పుచున్నాడు. దేశం మీద యెహోవా వర్షం కురిపించే వరకు కుండలో

పిండి తగ్గిపోదు, బుడ్డిలో నూనె అయిపోదు. వెంటనే ఆమె వెళ్లి ప్రవక్త చెప్పినట్లు చేసింది. ఆమెకి ఆమె కుమారుడికి ఆ పట్టణములో కరవు పోయేంతవరకు తినడానికి తిండి ఉంది, కుండలో పిండి తరిగిపోలేదు, బుడ్డిలో నూనె అయిపోలేదు.

ప్రవక్త అయిన ఏలియా ఆ ఊరిలో ప్రవేశించేటప్పటికి అతను ఎవరో ఆమెకు తెలియదు. కానీ ఏలియా నీళ్లు అడిగినప్పుడు, ఇవ్వడానికి సిద్ధపడింది. వెంటనే మరల రొట్టెను కూడా అడిగాడు. ఈ సమయములో ఆమెకు అనేక అనుమానములు కలగడానికి ఎంతో అవకాశముంది. ఎందుకనగా అతను దేవుని ప్రవక్త అని, దేవుడు అతనిని అక్కడికి పంపించారని ఆమెకు తెలియదు. రొట్టె కానీ, నీళ్లు కానీ ప్రవక్తకు ఇవ్వకూడదు అన్న మనస్తత్వం కాదు కానీ తన స్థితి గురించి ఆలోచిస్తూ ఉండిపోయింది. ఈ ఒక్కరోజు ఈ వ్యక్తికి ఇచ్చి, మేము ఎందుకు బాధపడాలి అని తలంచక, తన స్థితిని ధైర్యంగా అతనితో చెప్పింది. వెంటనే అతని నోటి నుండి వచ్చిన మాటని దేవుని మాటగా భావించుకొని హృదయంలో విశ్వసించి, వెంటనే విధేయత చూపుట ద్వారా కుటుంబములో సమృద్ధిని పొందుకుంది.

ఈ దినము అనేకులు దేవుడు స్వరముతో మాట్లాడితేనే నేను వింటాను అని మోసపోవుచున్నారు. దేవుని వాక్యము బోధించబడుచున్నప్పుడు, మనము ధ్యానిస్తున్నప్పుడు అనేకసార్లు దేవుడు మనతో సూటిగా మాట్లాడుతారు. ఆ మాటలను హృదయంలో చేర్చుకొని, విశ్వసించి, ఆజ్ఞను గైకొనుట ద్వారా అవి మన జీవితంలో ఎన్నడూ వ్యర్థం చేయబడవు.

అదే విధంగా ప్రవక్త చెప్పిన మాటని వినుట మాత్రమే కాక, ఆచరణలో పెట్టింది. ప్రవక్త చెప్పినది విని, సరే అని తల ఊపి, ఇంటికి వెళ్లిన తరువాత అతను ఎవరో నాకు తెలియదు, నాకు, నా కుమారుడికి సరిపోయే ఆహారంలో అతనికి వాటా ఎందుకు ఇవ్వాలి? అని ఆలోచించి, ప్రవక్తని మోసం చెయ్యలేదు కానీ ఇచ్చిన మాట ప్రకారం రొట్టెలు తీసుకువెళ్లి ఇచ్చుట ద్వారా ఆ పట్టణములో కరవు అధికమైననూ, ఈ కుటుంబములో జీవిత కాలమంతా సరిపడా, సమృద్ధి అయిన ఆహారమును పొందుకుంది.

ఒక యౌవనస్థుడు ఇంటింటికి తిరిగి న్యూస్‌పేపర్స్ వేసేవాడు. ఒక దినము బాగా అలసిపోయి నీళ్లు త్రాగుదామని ఒక ఇంటి తలుపు తట్టి అడిగాడు.

ఆ ఇంట్లోని స్త్రీ నీళ్లకు బదులుగా ఒక గ్లాసు పాలు ఇచ్చుట ద్వారా వాటిని త్రాగి, చాలా బలము పొందుకున్నాడు. అతను తిరిగి వెళ్ళిపోయాడు. చాలా సంవత్సరములు

గడిచిన తరువాత పాలు ఇచ్చిన ఆ స్త్రీకి అనారోగ్యం కలిగి ఆపరేషన్ చేయవలసి హాస్పిటల్‌లో జాయిన్ కావలసి వచ్చింది. అయితే వారి దగ్గర డబ్బు లేకపోవుటచే ఆపరేషన్‌ని ఆపివేసారు, ఆ హాస్పిటల్ కన్సల్టెంట్ డాక్టర్‌గా ఉన్న ఒక వ్యక్తి వచ్చి ఆమెను పరీక్షించి, వెంటనే ఆపరేషన్‌కి ఏర్పాట్లు చేయడం జరిగింది. అంతా సవ్యంగా జరిగి డిశ్చార్జి అయ్యి ఇంటికి వెళ్ళిపోవు సమయంలో ఆమె చేతికి ఒక లెటరు ఇవ్వడం జరిగింది. ఆ లెటర్‌లో అమ్మా ! మీ బిల్లు అంతా చెల్లించబడినది అని ఉంది. ఆమె చాలా ఆశ్చర్యపోయి, నా బిల్లు చెల్లించినది ఎవరు, నేను వాళ్లని చూడాలి అని అడిగినప్పుడు ఆ కన్సల్టెంట్ డాక్టర్ ఆమె ముందుకి వచ్చి, చాలా సం॥ల క్రిందట త్రాగడానికి నేను నీళ్లు అడిగినప్పుడు ఇచ్చి, బలము పొందుకునేలా చేసిన పేపర్ బాయ్‌ని అమ్మా అని చెప్పాడు. నేను మీరు చేసిన సహాయమును మరచిపోలేక పోవుచున్నాను. ఏ విధంగా ప్రతిఫలమును ఇవ్వాలా అని ఎదురుచూస్తున్న నాకు ఇప్పుడు ఒక మంచి అవకాశం దొరికింది అని అన్నాడు.

ఇచ్చుట అనే చర్య ద్వారా పొందుట అనే ప్రతిచర్య చూడగలము. కాబట్టి ఇచ్చుట ద్వారా మనము నష్టపోయేది ఏదీ ఉండదు అని గ్రహించుకొని, ఎల్లప్పుడూ ఇచ్చేవారిగానూ, ఎదుటి వారికి సహాయం చేయుచూ, మాటల ద్వారా ప్రేమ, ఆదరణ చూపిస్తూ, సమయమును వ్యయపరచుట మాత్రమే కాక తమకు కలిగిన దానితో వ్యయపరిచి, అనేకులను ఆదుకొనుట ద్వారా తప్పక ప్రతిఫలమును పొందగలము.

కొంతమంది స్త్రీలు దేవుని మాట వింటూ, వారికి ఉన్నది వ్యయము చేయుచూ, ఇచ్చేవారిగా ఉంటూ జ్ఞానముతో కుటుంబములను కట్టుకొనుచుండగా మరి కొంతమంది దేవుని మాట వినక అజ్ఞానముతో కుటుంబములను నాశనం చేసుకుంటున్నారు. మనము ఏ స్త్రీల వలె ఉన్నామో పరిశీలించుకొని, మార్పు తెచ్చుకొనుట చాలా ప్రాముఖ్యమైనది.

కాబట్టి ప్రియమైన వారలారా ! కుటుంబములోని స్త్రీలమైన మనము ఎల్లప్పుడూ దేవుని మాటకి విధేయత చూపుచూ, అపరితమైన విశ్వాసముతో వాగ్దానములను హృదయంలోకి చేర్చుకుంటూ, వినుట, అనుసరించుట, ఇచ్చుట అనే క్రియల ద్వారా దేవుని ఆశీర్వాదమును పొందగలము.

అట్టి ధన్యత దేవుడు మనకు దయచేయును గాక !

# ప్రశాంతమైన జీవితము

మన మనస్తత్వపు విధానములో కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రశాంతమైన జీవితమును జీవించడానికి అవకాశం ఉంటుంది. ఇప్పుడు కొన్ని మనస్తత్వపు విధానములను ధ్యానించుకుందాము.

**1. అనవసర జోక్యము :-** మనకు సంబంధం లేని విషయములలో జోక్యం చేసుకొని మనకి మనమే సమస్యలని సృష్టించుకుంటాము. మన ఆలోచనలకు తగినట్లుగా ఎదుటి వారు ఉండాలని భావిస్తాము. వారు మనకి నచ్చినట్లుగా ఉండకపోతే మార్చాలనే ప్రయత్నం చేస్తూ, భంగపడుతూ ఉంటాము. ఏ ఇద్దరు మనుష్యులు ఒకే విధంగా జీవించలేరు. దేవుడు మనందర్ని ఒక్కరిగా సృష్టించలేదు కానీ ఒక్కొక్కరిని ప్రత్యేకమైన వ్యక్తిత్వముతో సృష్టించారు. ఉదాహరణకు ప్రతి మనుష్యుడు ఏదో ఒక రంగు ఇష్టపడుతూ ఉంటాడు. తాను వినియోగించే వస్తువులలో ఒకరి ఇష్టానికి, మరొకరి ఇష్టానికి మధ్య వ్యత్యాసముంటుంది కానీ ఎక్కువమంది తమకు నచ్చిన రంగు లేక వస్తువు ఎదుటి వారికి కూడా నచ్చాలని భావిస్తారు. బలవంతంగా మరియు వాక్చాతుర్యముతో వారి ఇష్టాలను ఎదుటి వారి మీద రుద్దుతారు. తద్వారా కలిగే అభిప్రాయ భేదాల వలన ప్రశాంతమైన జీవితమునకు ఆటంకము కలుగుతుంది. కనుక ప్రతివారూ ఎదుటివారి ఇష్టాయిష్టాలను, వ్యక్తిత్వమును గౌరవిస్తూ, పొరుగువారి విషయములో అనవసరమైన జోక్యమును నియంత్రించుకొని జీవించాలి.

**అనవసర జోక్యమునకు ఉపమానరూపమైన సంభాషణ :-**

కాంత :- Praise the lord శాంత.

శాంత :- కాంతక్క Praise the lord బావున్నారా ?

కాంత :- బావున్నాను శాంత !

శాంత :- కాంతక్కా, ప్రార్థన చేసి వెళుదువు గాని రా !

కాంత :- శాంతా ! ఇంటికి ఇలాంటి రంగులు వేయించారేమిటి?

శాంత:- కాంతక్కా, ఇది మా ఆయన సెలక్షన్, ఇలాంటి రంగులు అంటే నాకూ, ఆయనకూ చాలా ఇష్టం.

కాంత :- అబ్బో ! ఏంటేస్ట్‌లు మీవి?

శాంత :- సర్లే గాని అక్కా, మొన్న బెనారస్‌లో పట్టుచీరలు కొనుక్కున్నాను చూడు

కాంత :- శాంతా ! రేటెంత?

శాంత :- రూ. 5,000, అక్కా

కాంత :- శాంతా, మీరు మోసపోయారు, ఇవి అంత రేటు ఉన్నట్లుగా అనిపించట్లేదు, మొన్న మా ప్రక్కింటావిడ ఇలాంటి వాటిని 2,000 రూపాయలకే కొనుక్కొని వచ్చింది.

శాంత :- ఈవిడకెందుకు చూపించాను దేవుడా? అన్నిటికి పేర్లు పెడుతుంది అని లోలోపల గొణుక్కుంటూ, నాకు చాలా పనుంది అక్కా అంటూ ముఖం మాడ్చుకొని పొమ్మని చెప్పకుండానే మాటలతో వెళ్ళగొట్టింది.

చూశారా ! ఇంటి రంగు గురించి, చీర రేట్లు గురించి అడగకుండానే అనవసర జోక్యం చేసుకొని భంగపడింది.

<u>**క్షమించుట మరియు మరచిపోవుట :-**</u> ఈ మనస్తత్వము శక్తివంతమైన ఆయుధము, మనలను నిందించి, అవమానపరిచి కీడు చేసిన వారిని గురించి ఎన్నో చెడ్డ అభిప్రాయములను హృదయంలో కలిగి జీవిస్తూ ఉంటాము. వాటిని గుర్తు పెట్టుకొని, పదే పదే జ్ఞాపకం తెచ్చుకోవడం వలన నిద్రలేమి తద్వారా అధిక రక్తపోటు, కడుపులో మంటలు వంటి అనారోగ్యములు కలగడానికి అవకాశముంటుంది. ఇవి మన చేతులారా మనమే కొని తెచ్చుకుంటున్నాము. క్షమించుట అనే విషయం పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌లో ఎంతో ప్రాముఖ్యమైనదిగా కనబడుతుంది. ప్రభువైన యేసుక్రీస్తు తన బోధలలో క్షమించుడి అప్పుడు మీరు క్షమించబడుదురు, క్షమింపకపోయిన యెడల మీరు కూడా క్షమించబడరు అని హెచ్చరించుట జరిగింది. ఎంతో విలువ కలిగిన చిన్న జీవితములో ఇటువంటి వ్యర్థమైన చెడు అభిప్రాయములను విడిచిపెట్టి, క్షమించుట మరియు మరచిపోవుట అనే ఆయుధమును సాధకం చేసికొనుట ద్వారా హృదయంలో ప్రశాంతతను కాపాడుకుంటాము.



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**– సీరియల్ 10వ భాగము**

ఇప్పుడు సుందర్ వెలివేయబడిన క్రైస్తవుడు, క్రైస్తవుల దగ్గరకే వెళ్లాలి, స్థానికులైన క్రైస్తవుల ఇండ్లకు వెళ్లడం నిష్ప్రయోజనం వారు పాకీ పనివారు. మిషను స్కూలు మూసివేయడంతో ఇప్పటికే వారెంతో శ్రమననుభవించారు. తనకు సహాయం చేయగలిగే స్థితిలో ఉన్ననూ ఆ పని చేయడానికి వారు భయపడవచ్చు గనుక 30 మైళ్ళ దూరంలో ఉన్న రాంపూర్‌లో ప్రెస్బిటేరియన్ మిషన్ కేంద్రము ఉన్నదని తెలుసు కాబట్టి తాను ఆశ్రయం పొందాలంటే అంతకు మించిన దగ్గర స్థలం లేదు గనుక అక్కడికి వెళ్ళి పాదిరి గారికి తన విషయమునంతా వివరించుకోవాలనే తీర్మానించుకున్నాడు. అయితే ఇలా బయలు దేరడానికి ముందు మరో సంఘటన జరిగింది. సుందర్ చూస్తుండగానే ఆయన వదిన బయటకు వచ్చి సుందర్‌ని చూచి పలకరింపుగా ఒక నవ్వు కూడా నవ్వలేదు గానీ లోపలికి వెళ్లి కొంచెం భోజనం తెచ్చి వరండాలో వడ్డించి, ఇది నీకేనన్నట్లుగా సుందర్‌కి సైగజేసింది. సుందర్‌కి ఇది ఎంతో అవమానమనిపించి, హృదయం నొచ్చుకుంది. తన స్వంత ఇంటివారే వెలివేయబడిన కులహీనులు చూచినట్లు తనను చూచేసరికి సుందర్ భరించలేకపోయాడు. ఇలా చేస్తారని అతడు తలంచను కూడా తలంచలేదు. సమాజంలో ఒకరినొకరు గౌరవంగాను, సమానంగాను చూచుకుంటునప్పుడు దాని విలువ తెలియదు గానీ అది లేకున్నప్పుడు దాని విలువ బాగా అర్థమవుతుంది. తాను తల వెంట్రుకలు కత్తిరించిన తరువాత ఇలాంటిదేదో జరుగుతుందను కొన్నప్పటికిని కుటుంబం నుండి తనను వెలివేస్తారని మాత్రం సుందర్ తలంచలేదు. అయిననూ దానిని ఓపికగా భరించాడు. ఎవ్వరి కంటా పడకుండా చెట్టు క్రింద ఒంటరిగా గడిపిన ఆ రాత్రి సుందర్‌కి ఎంతో బ్రహ్మాండంగా ఉంది గాని తెల్లవారుచుండడంతో గ్రామ జీవితం ఆరంభం కాబోవుచున్నది. తాను ఒక వెలివేయబడిన వాని వలె వరండాలో కూర్చుని భోజనం చేస్తుంటే ప్రజలు తనని ఎంతో తృణీకారంతో చూస్తారని తలంచిన సుందర్ అసలు అక్కడ భోజనం చేయకూడదనుకున్నాడు. కానీ ఆకలి వేయడం వలననూ, మరల భోజనం ఎప్పుడో, ఎక్కడో అనే పరిస్థితి గనుక తినక తప్పలేదు. భోజనం ముగించుకొని రాంపూర్ బయలుదేరాడు. రాంపూర్‌లోని ప్రెస్బిటేరియన్ పాదిరి రెవ. పి. సి. ఉప్పల్ గారి దగ్గరకు చేరేసరికి చాలా గంటలు పట్టింది, వచ్చి తన వరండాలో నిలిచి ఉన్న కుర్రాడు ఎవరో తెలుసుకొన్న

ఉప్పల్‌గారు ఎంతో దయార్ద్ర హృదయంతో సుందర్‌ను చేర్చుకున్నారు. హిందువైన ఉప్పల్ క్రీస్తువైపు తిరిగినప్పుడు అతన్ని కూడా ఇంట్లో నుండి గెంటివేశారు గనుక వేరే మతాల నుండి క్రీస్తువైపు తిరిగేవారు ఎన్ని కష్టాలు ఎదుర్కోవలసి వస్తుందో ఉప్పల్‌గారికి తెలుసు. సుందర్ ఆ పాదిరి గారింటికి వచ్చిన తరువాత హఠాత్తుగా తీవ్రమైన కడుపునొప్పితో మెలికలు తిరిగిపోనారంభించాడు. సుందర్ కేమయ్యిందో ఉప్పల్ గారికే కాదు సుందర్‌కి కూడా అర్థమై పోయింది. సుందర్‌కి విషాహారం పెట్టారు.

తమ మతమును విడిచి బాహాటంగా వేరే మతమును అనుసరించే వారికి విషాహారం పెట్టించడమనేది సర్వసాధారణమైన విషయమని అతనికి తెలుసు. అయితే రాంపూర్‌కు వచ్చే మార్గంలో తాను అస్వస్థుడయ్యేంత వరకు తనకు విషం పెట్టారన్న విషయం గాని, అందువలననే తనకీ అనారోగ్యం వచ్చిందని గాని సుందర్‌కి తెలియలేదు. తనతో పాటే క్రైస్తవునిగా మారిన సిర్దార్‌ని అలాగే చంపేశారని ఆ తరువాత తెలిసికొన్నాడు సుందర్. కొద్దిసేపట్లోనే సుందర్ ముక్కు నుండి, నోటి నుండి రక్తం కారనారంభించింది. వెంటనే రమ్మని స్థానిక ఆసుపత్రిలో ఉన్న వైద్యునికి కబురు పంపారు ఉప్పల్ గారు. ఈ లోగా సుందర్‌ని కొంచెం సౌకర్యంగా ఉంచడానికి చేయవలసిన ఉపచర్యలన్నీ చేసింది ఉప్పల్ గారి సతీమణి. అయితే ఆ డాక్టర్ వచ్చి సుందర్‌ని చూచి, అతని కథనంతా తెలిసికొన్న తరువాత వైద్యం చేయడానికి నిరాకరించి, ఇతనికి చాలా విషం పెట్టారు, కోలుకోడు, చనిపోబోచున్నాడు అని చెప్పాడు. ఏమి చేసినా చనిపోతాడు, ఆ తరువాత నేనే ఇతనిని చంపాను అనే నింద నా మీద కొస్తుంది అన్నాడా వైద్యుడు. అయితే మార్కు సువార్త చివరి అధ్యాయమును బిగ్గరగా చదివి వినిపించమని సుందర్ బ్రతిమలాడటంతో సుందర్‌ని సంతోష పెడదామని దాన్ని విని "క్రీస్తు పునరుత్థానమంతా" ఓ కట్టు కథ అంటూ రేపటికి సుందర్ చనిపోతాడు అని మనస్సులో అనుకుంటూనే రేపు వచ్చి ఇతనిని చూస్తానని చెప్పి వెళ్ళిపోయాడు డాక్టర్. తాను చెప్పినట్లే మరుసటి ఉదయం వచ్చి, ఎలాంటి నొప్పి లేకుండా కొంచెం బలహీనంగా ఉన్న సుందర్ వరండాలో పండుకొని తనను చూచి చిరునవ్వు నవ్వేసరికి ఆశ్చర్యపడిపోయాడా వైద్యుడు. జరిగినదేమిటో ఆ తరువాత అడిగి తెలుసుకున్నాడు.

– సేకరించబడినది. –(ఇంకా వుంది)



# మంచిపిల్ల

Hellow! పిల్లలూ ఎలా ఉన్నారు? ఎండలు బాగా ఉన్నాయి. ఎండలో తిరగవద్దు. ఎగ్జామ్స్ అయిపోయాయి అని ఇంక మాకు పని ఏమీ లేదని టైమ్ పాస్ చేయకండి. ఏదైనా చేయాలి అనే ఆసక్తి ఉంటే ఎన్నో అవకాశములు కనిపిస్తాయి. సహాయం చేసే మనస్సు ఉంటే మొదట మీ ఇంట్లో తల్లిదండ్రులకు చేయండి, తరువాత ఇతరులకు సహాయం చేయగలుగుతారు. మేలు చేయాలనే ఆశ ఉంటే మీ చుట్టూ ఉన్న పరిస్థితులలోనే మీకు ఎన్నో పనులు కనిపిస్తాయి.

శోభ నయమాను గారి ఇంట్లో పనిమనిషిగా, ఆయన భార్యకు సహాయం చేస్తూ ఉండేది. ఒకరోజు నయమాను గారి భార్య ఏడుస్తూ ఉండడం శోభ చూచింది. అంత పెద్దావిడ ఎందుకు ఏడ్చిందో తెలియక, ఏం జరిగింది చెప్పండి అని శోభ అడుగుతూనే ఉన్నది. ఏమీ లేదు నా భర్తకు కుష్ఠరోగం వచ్చింది, అంది. కుష్ఠరోగమంటే ఎంత ఘోరమైన రోగమో, అది తగ్గేది కాదని శోభకి తెలుసు. డాక్టర్లు ఏమీ చేయలేరు, మందులు ఏమీ లేవు, మంచం మీదనే ఉన్నా అది తగ్గదు. శోభ నయమాను భార్యకేసి చూసింది, ఆమె ఏడుస్తూ ఉన్నది. ఏదైనా మేలు తన యజమానురాలికి చేయాలనే గొప్ప ఆశ ఆమె మనసులో కలిగింది.

శోభకి దేవుడు అందర్నీ ప్రేమిస్తున్నారు అని, దేనినైననూ తగ్గిస్తారు అని, ఆయనకు అసాధ్యమైనది లేదు అనే విషయం గుర్తుకు వచ్చి చెబుదామంటే నయమాను భార్యకు దేవుడంటే ఇష్టం లేదు కాబట్టి కోపం వస్తుంది అని ఊరుకుంది. వెంటనే మరల శోభకు దేవుని ప్రవక్త అయిన ఎలీషా గుర్తుకు వచ్చాడు. ఆయన నయమాను గారిని తప్పక బాగుచెయ్యగలడు అని ఆలోచించి వెంటనే నయమాను భార్య దగ్గరకు వెళ్ళి ఎలీషాను కలుసుకుంటే నయమాను గారి జబ్బు నయమవుతుంది అని చెప్పింది. ఎలీషా ఎవరు అని ఆమె అడుగగా “ఆయన దేవుని సేవకుడు, గిల్గాలు అనే ఊరిలో ఉంటాడు ” అని చెప్పింది. ఈ విషయాన్ని నయమాను భార్య నయమానుతో చెప్పుట ద్వారా ఆయన ఎలీషా దగ్గరకి వెళ్లాడు.

ఎలీషా మంత్రం వేసి రోగమును నయం చేస్తాడు అనుకున్నాడు నయమాను, కానీ ఎలీషా దేవుని ప్రవక్త, దేవుడు ఏది చెబితే అది చేసి, ఇతరులకు సలహాలు ఇస్తూ ఉంటాడు. నయమానుతో నీవు వెళ్లి యొర్దాను అనే నదిలో 7 సార్లు మునిగితే నీవు బాగుపడతావు అన్నాడు. నయమానుకు చాలా కోపం వచ్చింది. యొర్దాను కంటే మంచి నదులు మా

దేశంలో ఉన్నాయి, నా ఇష్టం వచ్చినప్పుడెల్లా వాటిలో మునగగలను అని కోపంతో వెళ్ళిపోయాడు. కొంతసేపటికి కోపం తగ్గి, సరే ఎలీషా చెప్పినట్లుగా చేద్దాము అనుకున్నాడు.



కాబట్టి యోర్దాను నదికి వెళ్లి ఒకసారి మునిగి, తన శరీరమును చూచుకున్నాడు. కుష్ఠరోగం అలాగే ఉంది, 2వ సారి మునిగి మరల చూచుకున్నాడు, కుష్ఠరోగం అలాగే ఉంది . ఈ విధంగా 7సార్లు మునిగి బయటికి వచ్చి, తన శరీరమును చూచుకొని ఆశ్చర్యపోయాడు. కుష్ఠరోగం లేదు, పోయింది. దేవుడు ఎంత గొప్పవాడో అతనికి అర్థమై పోయింది. నయమానుకి చాలా సంతోషం కలిగింది. ఈ వార్త విన్న నయమాను భార్య కూడా చాలా సంతోషపడింది. శోభ నయమాను, అతని భార్య ఇంట్లో దేవుణ్ణి గురించి మాట్లాడుకుంటారు.

చూశారా పిల్లలూ! శోభ, ఆ కుటుంబము దేవుణ్ణి తెలుసుకునేటట్లు చేయడం మాత్రమే కాక, యజమానుడైన నయమానుకు స్వస్థతను కల్పించింది. ఇదంతా నాకెందుకు? నయమాను భార్య ఏది చెబితే అది చేయటమే నా పని అని శోభ కూర్చోలేదు కానీ ఆ కుటుంబ పరిస్థితులను అర్థం చేసుకుంది. తన యజమానురాలు బాధపడుతుంటే సమస్యను అడిగి తెలుసుకొని దాని నుండి విడుదల కలగడానికి సహాయం చేసింది. ఎంత మంచి పిల్ల కదా శోభ.

పిల్లలూ ! మీకు కూడా మంచిపిల్ల, మంచిపిల్లవాడు అని అందరూ అంటుంటే భలే సంతోషంగా ఉంటుంది కదూ ! మరి మంచిపనులు చేసేవారిని మంచివారు అంటారు కదా ! నయమానుకి ఎంత మేలు చేసిందో శోభ. మీరు కూడా దేవుని గురించి వింటున్నారు, ఆయన ఆశ్చర్య కార్యములు చూస్తున్నారు. మీ పొరుగువారు ఆపదలలో ఉంటే సహాయం చేయండి. దేవుని గురించి చెప్పి, సేవకులను కలవమని, వారి కొరకు ప్రార్థన చేస్తారనే సలహా చెప్పండి.

మీరు కూడా ఇతరులకు మేలు చేసి, వారిని దేవుని యొద్దకు నడిపించే మంచి పిల్లలుగా ఉంటారని ఆశిస్తూ........

**- ప్రేమతో మీ అక్కయ్య**

# "నా జీవితములో దేవుని మేలులు"

- వెంకటమ్మ, మెదక్ జిల్లా, మాణెపల్లి గ్రామము

నా పేరు వెంకటమ్మ. మాది మెదక్ జిల్లా, మాణెపల్లి గ్రామము. నాకు ముగ్గురు చెల్లెళ్లు, ఒక తమ్ముడు. మేము చిన్నతనము నుండి విగ్రహారాధన చేసేవారము. నాకు వివాహం జరిగిన రెండు సంవత్సరములకే టి.బి. వ్యాధి వచ్చింది. అప్పుడు అనంతగిరిలోని ఒక హాస్పిటల్‌లో నన్ను జాయిన్ చేశారు.ఎవ్వరూ లేకుండా, ఒంటరిగానే ఉంచారు. నేను హాస్పిటల్‌లో ఉండగానే ఇక బ్రతకనని చెప్పి మా అత్త, మామ నా భర్తకి రెండవ వివాహము చేసి, నన్ను హాస్పిటల్‌లోనే వదిలివేశారు. నాకు ఉన్న వ్యాధిని బట్టి ఎంతో దుఃఖపడుతూ ఉండేదానిని. హాస్పిటల్ నుండి తిరిగి ఇంటికి వచ్చిన తరువాత కూడా వారితో కలవనివ్వకుండా చాలా వేరుగా చూసేవారు. ఇలాంటి పరిస్థితులలో ఒక పాస్టరుగారు మా ఊరి ప్రక్క గ్రామము నుండి వచ్చి, దేవుని వాక్యమును బోధిస్తూ ఉండేవారు. మా బంధువులలో ఒకామె నువ్వు కూడా ప్రార్థన చేసుకో, దేవునికి అసాధ్యమైనది ఏదీ లేదు, ఏ స్థితినైననూ, ఎలాంటి రోగమునైననూ ఆయన స్వస్థపరిచి, నెమ్మదిని కలుగచేస్తారు అని చెప్పి ఆ ప్రార్థనకి తీసుకుని వెళ్లింది. అక్కడ ప్రకటించబడుచున్న దేవుని మాటలు వినినప్పుడు చాలా సంతోషము, నెమ్మది మరియు ఎంతో సమాధానము కలిగినట్లుగా అనిపించింది. ఆ తరువాత పాస్టర్‌గారు 3 రోజులు మీటింగ్స్ ఉన్నాయి, నువ్వు కూడా రావాలని చెప్పారు. అప్పుడు అక్కడికి వెళ్లిన నాకు యేసుప్రభువే ఆధారము, ఆయన నాకు ఉన్నారు అనే బలమైన విశ్వాసము కలిగింది. ఎందుకనగా టి.బి. వ్యాధితో బాధపడుతున్న సమయములో నా కుటుంబములోని వారు ఎవ్వరూ ఆదరించలేదు కానీ ఆయన బిడ్డగా నన్ను ఆదరించి, నెమ్మదిని దయచేశారు, కనుక నేను ఎప్పటికీ ఆయన బిడ్డగానే ఉండాలి అని ఆ మీటింగ్స్‌లోనే బాప్తిస్మము తీసుకున్నాను. తరువాత నాకు ఉన్న వ్యాది నిమిత్తము ఎక్స్‌రే తీసి, మరల డాక్టర్స్ పరీక్షించినప్పుడు, నాకు టి.బి. అనే వ్యాధి లేదు అని చెప్పారు. 6సం॥లుగా ఉన్న వ్యాధిని నా దేవుడు ముట్టి స్వస్థపరిచారు. నేను ఎంతో సంతోషించి అప్పటి నుండి క్రమము తప్పకుండా ప్రార్థనలకి వెళ్తూ, దేవుని వెంబడిస్తూ ఉన్నాను. నాకు వ్యాధి నుండి స్వస్థత కలిగిన తరువాత నా కుటుంబసభ్యులు, మరియు బంధువులు అందరూ నేను చర్చికి వెళుతున్నానని నిందించేవారు. ఎవరు ఏమి అన్ననూ, వారు నిందించిననూ నాకు బాధలలో తోడై యుండి నన్ను స్వస్థపరిచిన నా యేసయ్యని నేను విడిచిపెట్టలేదు. ఈ విధంగా గడుస్తూ ఉండగా, కొన్ని గొడవల కారణంగా నా భర్తని చంపివేసారు. తరువాత కొద్దిరోజులకే మా బంధువులు నన్ను అనేక విషయములలో బాధపెడుతూ ఉండేవారు. కానీ ప్రతి పరిస్థితులకు నేను దేవుని మీద ఆధారపడే దానిని. తరువాత కొన్ని దినములకు నేను


బ్రదుకుతెరువు కోసం హైదరాబాద్‌లోని చింతల్‌కి వచ్చి ఉంటుండగా, ఇక్కడ ఒక సహోదరి ద్వారా ఎపఫ్రా మినిస్ట్రీస్‌కి పరిచయము చేయబడ్డాను. దైవసేవకుల ద్వారా బోధించబడే వాక్యము నాలో ఉన్న బాధ, వేదనను తొలగించి ఎంతో ధైర్యమును కలిగించింది. భర్త చనిపోయిన తరువాత ఒంటరిని అయిన నాకు ప్రేమతో ఓదార్చే సంఘమును దయచేసిన దేవునికి స్తోత్రములు. గడిచిన సం॥లో నాకు ఆయాసము, దగ్గు కలిగినప్పుడు సేవకుల ప్రార్థన ద్వారా దేవుడు ముట్టి స్వస్థపరిచారు.

ఆస్థిపాస్తులేమీ లేకపోయిననూ, రేపటిని గురించిన చింత లేకుండా నడిపిస్తున్న దేవుడు ఎంతైనా నమ్మదగిన వాడు. సజీవుడై యున్న దేవుడు నా పక్షమై యుండి, మంచి ఆరోగ్యము, నెమ్మది, సంతోష సమాధానములను దయచేసి, నాకు సమృద్ధిని కలుగజేస్తూ, ప్రతి విషయములోనూ వాక్యముల ద్వారా, సంఘములోని ప్రేమ ద్వారా ఆదరించి, బలపరుస్తూ, ఒంటరిగా జీవిస్తున్న నన్ను ఎంతగానో కాచి కాపాడుచూ, పరలోకరాజ్యమునకు సిద్ధపరుచుచున్న దేవునికి ఎన్ని స్తుతులు చెల్లించిననూ ఋణస్తురాలనే.



# ఇది తెలుసా?

## (మలి)




ప్రపంచములోని పేద దేశములలో మలి ఒకటి. ఇది ఆఫ్రికా ఖండములోని పశ్చిమ దేశములలో ఒకటి.

| | | |
|---|---|---|
| **రాజధాని** | : | బామాకో |
| Prime Minister | : | Modibo sidibe |
| **జనాభా** | : | 14,517,176 |
| **రాష్ట్రపతి** | : | Amadou toumani toure |
| **స్వాతంత్ర్య దినము** | : | సెప్టెంబర్ -22, 1960 |

1. మలి దేశంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఎక్కువ. ప్రత్తి అనేది ప్రధానమైన పంట. అత్యధికముగా ఆ దేశములో ఎగుమతి అయ్యేది కూడా ప్రత్తి పంటే.
2. వ్యవసాయము దాని ఆధారిత పరిశ్రమలలోనే 80% మంది ప్రజలు పని చేస్తున్నారు. మరియొక 15% మంది సేవల రంగంలో పనిచేస్తున్నారు. ఆ దేశంలో పండించే ముఖ్యమైన పంటలు :– ప్రత్తి, రైస్, జొన్నలు, కూరగాయలు, పొగాకు
3. 90% ముస్లింలు, 5% క్రైస్తవులు, 5% నాస్తికులు
4. సగము మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువగా నివసిస్తున్నారు. వారి దినసరి ఆదాయము 60రూ॥ల కన్నా తక్కువ. ఆరోగ్యసంబంధమైన విషయములలో ప్రపంచములోనే ఘోరమైన స్థితిలో ఉన్న దేశం మలి.
5. వైద్యసదుపాయములు, మందుల సరఫరా చాలా తక్కువ. ప్రజలలో ఉన్న దారిద్ర్యత ఒక కారణమైతే కాలుష్యమైన వాతావరణము, శుభ్రమైన నీరు లేకపోవుట వలన అనేక రకములైన అనారోగ్యములను ఎదుర్కొంటున్నారు.
6. మలేరియా, ఎముకలకు సంబంధించిన వ్యాధులు, అంటువ్యాధులైన కలరా, టి.బి వంటివి అధికముగా ప్రబలి ఉన్నవి. పెద్దలు, పిల్లలలో అధిక శాతం హెచ్.ఐ.వి ఇన్‌ఫెక్షన్‌ని కలిగి ఉన్నారు.
7. సగటున మనిషి జీవించు సంవత్సరములు సరాసరి:

   పురుషులు :47సం॥లు  స్త్రీలు : 51 సం॥లు
8. అధిక శాతం కుటుంబములు స్కూలు యూనిఫామ్స్, పుస్తకములు, ఫీజులు కట్టలేని

**ఈ దేశం దారిద్ర్యత నుండి విడిపించబడాలని ప్రార్థిద్దామా !**

# అవతలి వారి పట్ల శ్రద్ధ కనపరచండి

12 సం॥ల పిల్లవాడు సరియైన బట్టలు లేకుండా, అమాయకంగా, చింపిరి జుట్టుతో, పరిగెత్తుకుంటూ ఐస్‌క్రీం పార్లర్‌కి వెళ్లాడు. ఆ పిల్లవానికి కోన్ ఐస్‌క్రీం అంటే చాలా ఇష్టం. టేబుల్ ముందు కూర్చుని, సర్వర్‌ని కోన్ ఐస్‌క్రీం ధర ఎంత? అని అడిగాడు. 25 రూ॥లు అని జవాబు వచ్చింది. తన చేతిలోని చిల్లరని లెక్కపెట్టుకొని, ఆ పిల్లవాడు ఒక చిన్న కప్ ఐస్‌క్రీం వెల ఎంత? అని అడిగాడు. సర్వర్ సమాధానం చెప్పడానికి చిరాగ్గా ముఖం పెట్టి, విసుగుతో 20రూ॥లు అని చెప్పాడు. నేను కప్ ఐస్‌క్రీం తీసుకుంటాను అన్నాడు పిల్లవాడు. ఆ ఐస్‌క్రీం తిని, బిల్లు చెల్లించి వెళ్లిపోయాడు. ఖాళీ ప్లేట్ తీయడానికి ఆ టేబుల్ దగ్గరకు వచ్చిన సర్వర్ మనసు చలించిపోయింది. ఆ ప్లేట్ క్రింద 5 రూ. పెట్టి వెళ్ళాడు ఆ చిన్నపిల్లవాడు.

ఆ చిన్నవాడు తనకి ఐస్‌క్రీం తెప్పించుకునే ముందు సర్వర్‌ని కూడా దృష్టిలో ఉంచుకున్నాడు. సున్నిత మనస్తత్వముతో, అవతలి వ్యక్తి అవసరతలను గమనించే స్వభావమును కనపరిచాడు. తనని గురించి ఆలోచించే ముందు ఇతరుల గురించి ఆలోచించాడు.

చూశారా! ఆ పిల్లవాడి దగ్గర ఉన్న డబ్బు 25 రూ॥లు . ఆ డబ్బుతో కోన్ ఐస్‌క్రీం వస్తుంది. కానీ సర్వ్ చేసే వ్యక్తి గురించి ఆలోచించి, కోరికను నియంత్రించుకొని, కప్ ఐస్‌క్రీం తీసుకొని 5 రూ॥లు అతనికి ఇచ్చాడు. ఎంత మంచి మనస్సు ఎదుటి వారి పట్ల శ్రద్ధ కనుపరిచే మనస్సు.






# ఆత్మ ఫలము - 8వ భాగము

- ఎడిటర్

**ఆత్మఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, విశ్వాసము, మంచితనము, సాత్వికము, ఆశానిగ్రహము.**


**ఆత్మఫలములో ఐదవది దయాళుత్వము.**

కనికరం అనే మాటలో దయ అనే భావం ఇమిడి ఉంది. మనలో అనేకమంది తమ యెడల దయ చూపిన వారికే దయచూపటానికి ఇష్టపడతారు, కానీ చాలా కొద్దిమంది మాత్రమే అవసరములో ఉన్నవారికి దయ చూపటానికి ఇష్టపడతారు. దయ చూపించుట అనేది అర్హతల మీద ఆధారపడి ఉండదు. నాకు కావాలి అనే మాటలో ప్రత్యేకత ఏమీ లేదు కానీ ఇతరులకు అవసరమైన దానిని ఎట్టి పరిస్థితులలోనైనా ఇవ్వాలి అని అనుకోవడం శక్తివంతమైన జీవితంగా ఉంటుంది. ఇతరుల పట్ల దయను కలిగి ఉండుటను బట్టి దేవుడు మనకి ప్రతిఫలం ఇస్తారు. దయ కలిగిన వ్యక్తిగా నీవు ఉన్నప్పుడు ఎల్లప్పుడు ఇవ్వడమే కానీ తీసుకోవడం అనేది నీ జీవితంలో ఉండదు అని సాతాను మనలను నిరాశపరచవచ్చు. మనకి తెలియని వ్యక్తి మీద దయ చూపించుట వలన దేవుడు మన మీద దయ చూపిస్తారు. అనగా మనపట్ల దయను చూపించడానికి వేరొకరిని వాడుకుంటారు. మనకి రావలసిన శిక్ష నుండి దేవుని దయ మనలను కాపాడుతుంది. దయ కలిగి ఉండుటలో ఇచ్చుట అనేది ఒక భాగం, ఇచ్చుట అనేది జీవనశైలిగా ఉండాలి. మనలను తృణీకరించి, హేళన చేసిన వారికి దయ చూపించవలసిన అవసరం వచ్చినప్పుడు గతించిన వాటిని ఏమాత్రం జ్ఞాపకం చేసికొనక దయ చూపించవలసిన వారమై ఉన్నాము. మనకి అర్హత లేకపోయిననూ దేవుడు తన దయాళుత్వమును మన పట్ల చూపించాడు. ఆయన ఎంత మంచి దేవుడో దీనిని బట్టి మనకి తెలుస్తుంది.  అలాగే మనము కూడా ఇతరుల పట్ల దయ చూపించుట ద్వారా మన సాక్ష్యము అనేకులను ప్రభావితులను చేస్తుంది. బైబిల్‌లో ఆదికాండము 14వ అధ్యాయము చూచినప్పుడు, అబ్రాహాము దగ్గర ఉన్న లోతు అబ్రాహామును విడిచి, ఆశీర్వాదం వెంట పరుగులెత్తి చివరకు శత్రువు చేతికి చిక్కి తన ఆస్థిని, కుటుంబమును పోగొట్టుకొని, ఏం చేయాలో తెలియకుండా ఉన్నప్పుడు అబ్రాహాము తన దయ అనే తత్వమును బట్టి శత్రువులతో యుద్ధము చేసి, లోతు పోగొట్టుకున్న సమస్తమును సంపాదించి పెట్టెను. దీనిని బట్టి దేవుడు అబ్రాహాముని ఎంతగానో దీవించెను. దయాళుత్వము అనే స్వభావమును మనం కలిగి ఉండుట ద్వారా శక్తివంతమైన వ్యక్తులుగా మార్చబడి, జీవితంలో శక్తివంతమైన కార్యములను చూడగలుగుతాము.

– (ఇంకావుంది)

# జీవితము

| | | |
|---|---|---|
| జీవితము ఒక సదవకాశము | – | సహాయము చేయి |
| జీవితము సౌందర్యమైనది | – | ప్రశంసించు |
| జీవితము సంతోషకరమైనది | – | రుచి చూడు |
| జీవితము ఒక కల | – | సాకారము చేయి |
| జీవితము ఒక సవాలు | – | ఎదుర్కో |
| జీవితము కర్తవ్యము | – | సంపూర్ణము చేయి |
| జీవితము ఒక ఆట | – | ఆడు (Play it) |
| జీవితము వాగ్దానము | – | నెరవేర్చు |
| జీవితము విచారకరమైనది | – | జయించు |
| జీవితము ఒక పోరాటము | – | పారిపోవద్దు |
| జీవితము ఒక పాట | – | కీర్తించు |
| జీవితము దుఃఖకరమైనది | – | ఓడించు |
| జీవితము ఒక సాహసము | – | ధైర్యము చేయి |
| జీవితము అమూల్యమైనది | – | నాశనము చేయవద్దు |





# గిల్బోవ పర్వతము

గిల్బోవ పర్వతము వద్ద ఫిలిష్తీయుల చేతిలో సౌలు రాజు, అతని సైన్యము పూర్తిగా ఓడింపబడిరి. సౌలు మరియు అతని కుమారులైన యోనా తాను, అబీనాదాబు, మెల్కీషూవలు చంపబడిరి.

గిల్బోవ అను మాటకు పొంగుచున్న ఊట అని అర్థము. షూనేం అను ఊరు మెగిద్దో మైదాన భూమిలో ఉంది. దీనికి యెజ్రెయేలు అని కూడా పేరు. ఈ యెజ్రెయేలు మైదానమునకు తూర్పుగా ఉండు గిల్బోవ పర్వత సముదాయము ఎత్తు సుమారు 1700 అడుగులు.

ఫిలిష్తీయులు ఇశ్రాయేలీయులతో యుద్ధము చేయవలెనని సైన్యములను సమకూర్చి దండెత్తి వచ్చి షూనేములో దిగగా సౌలు ఇశ్రాయేలీయులందర్ని సమకూర్చి, గిల్బోవలో దిగెను. అంతలో ఫిలిష్తీయులు ఇశ్రాయేలీయులతో యుద్ధము చేయగా ఇశ్రాయేలీయులు వారి యెదుట నుండి పారిపోయిరి. గిల్బోవ పర్వతము వరకు ఫిలిష్తీయులు వారిని హతము చేయుచు, సౌలును అతని కుమారులను తరుముచు యోనాతాను, అబీనాదాబు, మెల్కీషువ అను సౌలు యొక్క కుమారులను హతము చేసిరి. యుద్ధములో సౌలు ఓడిపోవుచుండగా, అంబులు వేయువారి కంటబడి వారిచేత బహు గాయములు పొందెను. అప్పుడు సౌలు సున్నతిలేని వీరు వచ్చి నన్ను చంపి అపహసించకుండా, నీ కత్తితో పొడువుమని ఆయుధములు మోయువానితో చెప్పగా అతడు భయముతో ఆలాగు చేయనొల్లకుండెను గనుక సౌలు తన కత్తి మీద పట్టుకొని దాని మీద పడెను. ఆయుధములు మోయువాడు కూడా తన కత్తి మీద పడి మరణమాయెను. ఈ విధముగా సౌలు, అతని కుమారులు, ఆయుధములు మోయువాడు అందరును ఒక్క దినమందే చనిపోయిరి. మరునాడు ఫిలిష్తీయులు ఇశ్రాయేలీయులలో హతమైన వారిని దోచుకొన వచ్చి గిల్బోవ పర్వతము మీద పడిపోయిన సౌలును, అతని కుమారులును కనుగొని, అతని తలను ఛేదించి అతని ఆయుధములను తీసి, తమ బొమ్మల గుళ్లలోను, జనులలోను జయ వర్తమానము తెలియజేయుటకై ఫిలిష్తీయుల దేశములో నలుదిశలు వాటిని పంపిరి.




# బైబిల్ క్విజ్ -10

(పాత నిబంధనా గ్రంథంలో
16-20 పుస్తకములలో నుండి ఇవ్వబడినవి)

**1. అహష్వేరోషు కోటలో స్త్రీలకు ఒక విందు చేయించినది ఎవరు?**

**2. నీ ఇష్టవస్తువులన్నియు దానితో సమానములు కావు . దానిని ఏమంటారు? రిఫరెన్సు?**

**3. పని మిక్కిలి గొప్పది - మన దేవుడు మన పక్షముగా యుద్ధము చేయును, ఈ మాటలు ఎవరు ఎవరితో అన్నారు?**

**4. నా అతిక్రమమును, నా పాపమును నాకు తెలియజేయుము. రిఫరెన్సు?**

**5. నన్ను గాక మరి ఎవరిని రాజు ఘనపరచనపేక్షించునని తనలో తానను కొనిన వ్యక్తి ఎవరు?**

**6. కీర్తనల గ్రంథాన్ని ఎన్ని భాగాలుగా విభజించారు?**

**7. ఏ అధ్యాయము సామెతల గ్రంథమును పరిచయం చేస్తుంది?**

**8. ఏరులై పారుచున్న తేనెను, వెన్నపూసను చూచి వారు సంతోషింపరు-రిఫరెన్సు?**

**9. దేవుడు యోబుతో మాట్లాడిన అధ్యాయాలు - రిఫరెన్సు?**

**10. నీవు తిండిపోతువైన యెడల నీ గొంతుకకు కత్తి పెట్టుకొనుము - రిఫరెన్సు?**

ఈ ప్రశ్నలకి సరైన సమాధానములు మే 31 తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు జూలై పత్రికలో ప్రచురించబడతాయి.

పంపవలసిన చిరునామా:- **ఎడిటర్-స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**<u>బైబిల్ క్విజ్ - 9 జవాబులు:</u>**

1. హిజ్కియా (2 రాజులు 20:7)
2. 50 మంది (2 రాజులు 2:7)
3. ఇశ్రాయేలు రాజు పేరు లేదు (2 రాజులు 6:31)
4. ఓబద్యా (1 రాజులు 18:3)
5. దేవుడు సొలొమోనుతో (1 రాజులు 3:5)
6 ఎలీషా, రెండు పాళ్ళు (2 రాజులు 2:20,21,9)
7 షోమ్రోను ద్వారమందు (2 రాజులు 7:1)
8. ఏలీయా (1 రాజులు 17:5)
9. యోషియా (2 రాజులు 22:20)
10. అహవా నది దగ్గర శుభ ప్రయాణం కొరకు వేడుకొనిరి (ఎజ్రా 8:21)

**<u>బైబిల్ క్విజ్ - 9 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :</u>**

సౌజన్య, కస్తూరి.

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## మే - జూన్

భాగ్యలత : మణి, శిరీష, మేరీరత్నం, జ్యోతి, వెంకటేశ్, మల్లిక, హారిక, రోషిణి, శారా, మాధురి, సుధ, రూతు, శేఖర్‌బాబు, రఫీ, మేరీఫాతిమా, జాన్, పాల్‌రాజ్, వీరలింగం, నవ్య, జయరాజు, ఫిలిప్పు, మన్యం, లక్ష్మీ, నవీన, రూతు, విజయ, జ్యోతి, లత, నాగరాజు, కృష్ణకళ్యాణ్, ప్రియాంక, వినయ్‌కుమార్, నాగరాజు, నవీన్, అనిల్‌కుమార్, మధుబాల, ప్రశంస, ప్రశాంతి, గీతాసాత్విక, ఆనందప్రసాద్, మణికాంత్ రెడ్డి, కృపాజ్యోతి, శారమ్మ, మమత,శేఖర్ (సింగపూర్).

చింతల్ : విజయ, సాత్విక్, శామ్సన్, సాల్మన్‌రాజు, జీవా, రమ్య, శ్రీనివాసరావు, జగన్‌మోహన్ రావు, అనూష, లత, గోపిచంద్, ఐజాక్‌కుమారి, వెన్నెల, నిహారిక, రవీందర్, జాన్సన్, సురేష్‌బాబు, స్వర్ణలత, మల్లేశ్వరి, సంధ్యారాణి, ప్రజ్ఞ, సునీత, ఆనంద్‌కుమార్, బాబూరావు,అభిషేక్,మరియ,బెంజిమన్, రాధాకృష్ణ, దేవకిరణ్, విజయమ్మ, సురేంద్ర, ఎలిజబెత్ రాణి, వివేకవతి, నిర్మల, ప్రశస్త, ఎస్తేరురాణి, రూతమ్మ, జీవమణి, జగన్, విజయ్, కృపారాణి.

అనాజ్‌పూర్ : జీవన్‌కుమార్, మృణాలిని, మహాలక్ష్మి, ఆంద్రెయ, జాషువా, నరసింహ, రాజ్‌కుమార్, రత్నాకర్, కారుణ్య, సుజిత్‌కుమార్, బ్లెస్సీ, మరియమ్మ.

**ఇ.సి.ఐ.యల్ :** విజయ్‌కుమార్, ఆనంద్, వివేక్.

**'స్పర్శ'** అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/–లు, సంవత్సర చందా రూ. 50/–లు, జీవితకాల చందా రూ. 1000/–లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________


______________________________

______________________________

______________________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్–70, ఫోన్: 040–2420 2227

# ఛార్లెస్ ఫిన్నీ



జోనాతాన్ ఎడ్వర్డ్స్, జార్జ్‌విట్‌ఫీల్డ్‌ల కాలంలో అమెరికా ఉజ్జీవించబడింది, కాని కాలక్రమేణా భక్తి సన్నగిల్లి పోయింది. ఎక్కడ చూచినా అల్లరులు, ప్రాంతీయ విభేదాలు ఎక్కువై అనేక మంది తప్పుడు బోధలు చేసి, సంఘమును కూడా తప్పుదారి పట్టిస్తున్న పరిస్థితులలో ఛార్లెస్ ఫిన్నీ బాప్తిస్మమిచ్చు యోహాను వలె పరిశుద్ధాత్మ అగ్నితో సువార్తను బోధించుటకు పూనుకున్నాడు.

ఛార్లెస్ ఫిన్నీ 1792వ సం॥ ఆగస్టు 29వ తేదీన లిట్‌ఫీల్డ్ కౌంటీలోని వారెన్ నగరమందు జన్మించాడు. ఇతని తండ్రి అయిన సిల్వెస్టర్ ఫిన్నీ అమెరికాలోని ఒక వ్యవసాయదారుడు. తరువాత వారు న్యూయార్క్ రాష్ట్రములోని ఒనీడా కౌంటీకి తరలివెళ్లారు. 29 సం॥ల వయసు వరకు ఛార్లెస్ ఫిన్నీ ఉపాధ్యాయుడుగా, న్యాయవాదిగా పనిచేస్తూ, భక్తి సంబంధమైన విషయములను ఏమీ పట్టించుకోలేదు. అప్పుడప్పుడు ఫిన్నీ గుడికి వెళ్లి ప్రసంగాలు వినేవాడు గాని అవి అతనికి ఎంత మాత్రము రుచించలేదు.

ఆడమ్స్ విశ్వవిద్యాలయమునకు ఫిన్నీ న్యాయశాస్త్ర విద్యను చదువుకోవడానికి వెళ్లినప్పుడు బైబిల్ దేవుని సత్యవాక్యం అని తేటగా గ్రహించాడు. 1821 సం॥శరద్‌ఋతువు నందు ఒక ఆదివారపు సాయంత్రం తన ఆత్మ రక్షణను గురించి దేవునితో సమాధానపడాలని నిశ్చయించుకొని, మూడు దినముల తరువాత ప్రార్థిస్తుండగానే తన హృదయం నిండా గొప్ప ప్రశాంతత ఆవరించి పాప భారం పూర్తిగా తొలగిపోయింది. ఫిన్నీ మారుమనసు పొందిన రోజునే బహుబలంగా పరిశుద్ధాత్మాభిషేకం కూడా పొందాడు. "నేను క్రీస్తు విశ్వాసిగా మార్పునొందినచో సువార్తను ప్రకటిస్తాను" అనే భావనతో అనేక గ్రామములను, పట్టణములను తిరుగుచూ దేవుని సువార్త ప్రకటిస్తూ ముందుకి సాగుచుండెను.

ఫిన్నీ యొక్క ప్రసంగముల వలన అనేకులు మార్పు చెంది దేవుని స్వంత రక్షకునిగా అంగీకరించుట మాత్రమే కాక, బలమైన ఉజ్జీవమును కూడా పొందుకున్నారు. ఫిన్నీ సువార్తసేవా విషయంలో కేవలం సంసిద్ధత గలవాడు మాత్రమే అయ్యుండి ప్రార్థనా హీనుడిగా ఉండలేదు. బోధించే అంశమును మోకాళ్ళ ప్రార్థన ద్వారా సంపాదించి, ఆత్మ ప్రేరేపణ ద్వారా ప్రసంగములను చేసేవాడు. ఇటువంటి ప్రసంగములు ప్రజలలో శక్తివంతముగా పనిచేసేవి.కొన్నిసార్లు ఆత్మల భారము వలన ఎంతగానో కృంగిపోయి, ఎడతెగకుండా ప్రార్థన చేసేవాడు. ఆయన ఇహలోక జీవితంలోని ఆఖరు దినము ఒక ప్రశాంత పరిశుద్ధ దినము. దగ్గరగా నున్న సంఘములో సాయంత్రపు ఆరాధనలో మొదటిగా వినబడే సంగీతం కోసం ఆయన భార్యతో కలిసి వెళ్లి తిరిగి వచ్చుచుండగా, గుండెనొప్పి ప్రారంభమయ్యింది. కొన్ని గంటలు హృద్రోగముతో బాధపడిన తరువాత 1875వ సం॥ ఆగస్టు 16వ తేదీన ప్రభువు నందు నిద్రించారు.

అయితే ఫిన్నీలో మండిన దేవుని అగ్నిజ్వాల మాత్రం ఆరిపోలేదు. ఆయన కాలంలోనే అది లక్షలాది మంది అమెరికన్లను, బ్రిటీషువారిని మండించింది. ఈ అగ్ని తరువాత తరముల వారికి కూడ పాకి నేటికీ అనేక మంది విశ్వాసులలో మండుతూనే ఉన్నది. ఈ అగ్ని ఎన్నడు ఆరిపోదు. ఎవరును దానిని ఆర్పజాలరు.

మే 1వ తేది, 2010న జరిగిన ఉపవాస ప్రార్థనలో పాల్గొన్న అనేకులు
ఆత్మీయ మేలులతో నింపబడటం జరిగినది.







# ఎపఫ్రా మినిస్ట్రీస్


ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్-500 070
Ph: 040-24202227  email: mail2church@gmail.com